


# శబరి

గొడవర్తి జానకి శ్యామసుందర్

"ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై" శ్రావ్యంగా మృదు మధురంగా గజేంద్రమోక్షంలోని పద్యాలు అమ్మమ్మ చదువుతోంది. పక్షులు ఆవిడ గళ మాధుర్యానికి వంతుగా తమ కిలకిలారావాలను సందడిగా చేస్తున్నాయి.

**ప్రకృతి అంతా పులకిస్తోంది. చీకటి తెరలు తొలగించుకుంటూ భానుని లేలేత కిరణాలు తూర్పున కనిపించే సమయానికి "కౌసల్యా సుప్రజా రామా పూర్వా సంధ్యా ప్రవర్తతే" అమ్మమ్మ మేలుకొలుపు. పూజ పూర్తయిందన్నట్లుగా ఘంటారావం" ఉలిక్కి పడి కళ్ళు తెరిచాను. రైలు వేగంగా వెళుతోంది.**

"నిద్రపట్టిందిలే అని డిస్టర్బ్ చేయలేదు, అప్పుడే లేచావేం" నవ్వుతూ అంటున్న భర్త మురారివైపు చూసింది.

"అమ్మది నిద్రకాదు నాన్నగారూ! ఒక విధమైన ట్రాన్స్!! ఈ ప్రయాణం అనుకొన్నప్పటి నుంచి తన ధ్యాసంతా తాతమ్మా వాళ్లింట్లోనే వుంది" నవ్వుతూ అంది శ్రావ్య.

"అవును నేనూ గమనించాను. వేదా! నిన్ను అంతగా ఆకట్టుకొన్న అమ్మమ్మ గారింటి విశేషాలు సరదాగా చెప్పరాదా. చిన్నప్పుడు నువ్వు వాళ్ళింట్లోనే పెరిగానన్నావు కదా. అప్పటి సంగతులు, ఆవిడ గురించి తెలుసుకోవాలనుంది" కాఫీ అందిస్తూ అన్నాడు మురారి.

"ఎస్! ఈ ఐడియా బావుంది. చెప్పమ్మా. నాకూ తెలుసుకోవాలని చాలా ఇంట్రెస్టింగా వుంది" హుషారుగా అన్నాడు చందూ.

"ఈ బిజీ రొటీన్ లైఫ్‌లో పెద్దవాళ్ళ గురించి పట్టించుకోవటం, వాళ్ళ బాగోగులు విచారించటం బొత్తిగా తగ్గిపోయింది. వృద్ధాశ్రమాల కల్చర్ ఎక్కువైన ఈ రోజుల్లో అమ్మమ్మ ఇంకా మనమధ్యే వుండటం ఒక వింతగానే కనిపిస్తోంది. ఇప్పటికైనా మనం బయలుదేరడం, ఒక మంచిని చేశామని అనిపిస్తోంది" అన్నాడు మురారి.

"అవునండీ చాలా ఏళ్ళవుతోంది అమ్మమ్మని చూసి. శ్రావ్యే చిన్న పిల్ల. చందూ అయితే ఆవిడని అసలు చూడనే లేదు. ఆ మధ్యన చిన్నపెద్దమ్మ ఫోన్ చేసి అమ్మమ్మ అందరిని చూడాలనుకుంటోంది. ఒకసారి పిల్లల్ని తీసుకుని రాకూడదూ అనటంతో, అడగ్గానే మీరు ఒప్పుకోవటం, ఇలా బయలుదేరగలిగాం. దూరంగా ఉండటంతో చిటుకూ చిటుకూ వెళ్ళలేకపోవటంతో మరీ ధ్యాస ఎక్కువైంది" సాలోచనగా వివరించింది వేదవతి. చాలా రోజుల తర్వాత పెరిగి పెద్దదైన పరిసరాలు చూడబోతున్నాననే భావన ఎంతో ఉద్వేగాన్ని పెంచుతున్నాయి. వేగంగా వెళ్తోన్న రైలు కిటికీలోంచి బయటకు చూస్తుంటే వెనక్కి పరిగెడుతోన్న చెట్టూ చేమా గుట్టలతో పాటు మనస్సు కూడా వెనక్కెళ్ళింది.

అమ్మమ్మకి మడీ ఆచారం చాలా ఎక్కువ. ప్రొద్దున్నే పూజ పూర్తయినట్లుగా హారతి గంట మోగే సరికి, అందరం అక్కడకు చేరేవాళ్ళం ప్రసాదం కోసం. నేను కనిపించక 'వేదా ఇంకా లేవలేదా?' అంటూ ఆవిడ కలియజూస్తుంటే చటుక్కున ముందుకొచ్చి 'నేను అప్పుడే లేచాగా అమ్మమ్మా' అంటూ పరుగున వెళ్ళి ఆవిడని చుట్టేశాను.

" ఓసి భడవా! ముట్టుకొన్నావటే. నా స్తోత్రం జపం ఇంకా పూర్తికానేలేదు" అమ్మమ్మ గదమాయింపు. బిత్తరపోవడం నా వంతు.

ఆవిడ మడిలో ఉన్నప్పుడు ఎవరైనా తాకితే విపరీతమైన కోపం ప్రకటించేది. ఉత్తప్పుడు ఎంత ఆపేక్షగా, ప్రేమగా, ఆప్యాయంగా సన్నిహితంగా మెలిగేదో, మడి-పూజ- ఆచారం విషయంలో మాత్రం రాజీపడేది కాదు.

ఆరోజంతా నాతో మాట్లాడదేమో అనుకున్నాను. కానీ అందుకు భిన్నంగా, నవ్వుతూ నా తల మీద చెయ్యివేసి ప్రసాదం చేతిలో వుంచేది. ఇంతలో బయటినుండి యాదమ్మ "అమ్మగారూ" అంటూ వేసిన కేకతో గుమ్మంలోనే నిల్చొని "ఏమే యాదమ్మా! రంగీ, పిల్లాడూ బాగున్నారా" అడిగింది అమ్మమ్మ.

"మీ దయవల్ల సల్లంగున్నారమ్మా. యియ్యాల డాక్టరోరు పత్యం ఎట్టమన్నారమ్మా. కాసింత చింత తొక్కొడతారేమోనని అడుగుదామని వచ్చానమ్మా" గుక్కతిప్పుకోకుండా సమాధానమిచ్చింది యాదమ్మ.

"అలానా. వుండు ఇప్పుడే వస్తా" అంటూ లోపలికెళ్ళిన అమ్మమ్మ మరుక్షణంలో పెద్ద బాదం ఆకులో యింత చింతకాయ పచ్చడి పెట్టి, రెండు చీరెలు కూడా యిస్తూ, " ఇదిగో యాదమ్మా! ఈ చీరెలు పిల్లాడికి మెత్తగా పక్కకెయ్యి" అంటూ చేతిలో పెట్టింది.

"దయగల తల్లి సల్లగుండాల. మరి వత్తానమ్మా. నెలలోపు మీకాడికి తీసుకొచ్చి చూపిత్తానమ్మా తల్లిపిల్లాడ్ని" అంది వినయంగా యాదమ్మ.

"పిచ్చి మొఖమా! నా దగ్గిరకెందుకు. గుడికి తీసుకెళ్ళు" అమ్మమ్మ సమాధానమిచ్చింది.

"మీకె తెల్వదమ్మా! మీరే దేవుడు మాకు" అంటూ వెళ్ళింది యాదమ్మ.

ఇది మామూలే ఆ ఇంట్లో. ఎవరో ఒకళ్ళొచ్చి ఏదో ఒకటి అడిగి తీసుకెళుతూంటారు. ఆ ప్రాంతంలో ఆవిడ మాటే వేదవాక్కు అందరికి. కుటుంబ విషయాలు, ఆరోగ్య సమస్యలు, నిత్య జీవితంలో మంచి, చెడూ అన్నింటా సంప్రదింపులు చేస్తూనే వుంటారు. ఆవిడ కూడా తార్కికంగా ఆలోచించి తనకు తోచిన ఉచిత సలహాలు ఇస్తుండేది. చిన్నా చితకా అనారోగ్యాలకు ఆవిడ ఇచ్చే హోమియోపతి మాత్రల్లా సలహాలు కూడా తియ్యగా అనుభవైకవేద్యంగా ఉండేవి.

**ఆ ప్రాంతంలో ఆవిడ మాటే వేదవాక్కు అందరికి. కుటుంబ విషయాలు, ఆరోగ్య సమస్యలు, నిత్య జీవితంలో మంచి, చెడూ అన్నింటా సంప్రదింపులు చేస్తూనే వుంటారు. ఆవిడ కూడా తార్కికంగా ఆలోచించి తనకు తోచిన ఉచిత సలహాలు ఇస్తుండేది. చిన్నా చితకా అనారోగ్యాలకు ఆవిడ ఇచ్చే హోమియోపతి మాత్రల్లా సలహాలు కూడా తియ్యగా అనుభవైకవేద్యంగా ఉండేవి.**

తొంభయ్యేళ్ళ ఎదురింటి వెంకాయమ్మకు ఆగకుండా విరోచనాలౌతుంటే గబగబా సీసాలో హోమియోపతి మాత్రలు ఇచ్చివచ్చేది. మర్నాడు ఆవిడ "నీ చేతి చలవ చాలామంచిదే కావుడూ! అంతేసి విరోచనాలు తక్కున కట్టాయంటే నమ్ము" కృతజ్ఞతగా చెప్పేది.

ఇలా చాలా వైద్యాలు ఎంతో యుక్తిగా చేసేది.

"తాతమ్మ డాక్టర్ కూడానామ్మా" నా ధోరణి కడ్డు వస్తూ అడిగింది శ్రావ్య.

" ఆవిడ మా తాతగారి దగ్గరనుంచి నేర్చుకొన్న హోమియోపతి వైద్యం కాక, మన ప్రాచీనమైన ఆయుర్వేదం కూడా ఎంతోనమ్మకంగా ఆచరించేది. తన మీదగూడా నిరంతర ప్రయోగాలు చేస్తుండేది. ఏ నలతకైనా ఏదో ఒక కషాయం సేవించేది గాని ఇంగ్లీషు మందుల జోలికి వెళ్ళలేదు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఎంతో నిబ్బరంగా వుండేది. ఏ విషయంలోను అధైర్య పడకూడదని మాకెప్పుడూ చెప్పూండేది.

పెరట్లో ఒక ప్రక్కంతా తులసివనంలా వుండేది. కార్తీక మాసమంతా ప్రొద్దున సాయం త్రం నిష్టగా దీపాలంకరణ చేసేది. అటు పూజకు ఇటు వైద్యానికి రెంటికి సమంగా వాడేది ఆ తులసిని.

ఇంకో ప్రక్కంతా వివిధ రకాల పూలమొక్కలుండేవి. ప్రొద్దున్నే చూసిన వారికి మల్టీకలర్ ఫొటోలా ఉండేది ఆ దృశ్యం. రంగు రంగుల పూలు తమ వయ్యారాలు ఒలకబోస్తూ అందంగా విచ్చుకొని పరిమళాలు వెదజల్లుతుండేది సున్నితంగా. పూలన్నీ నేలరాల్చిన పారిజాతం చెట్టు హుందాగా నిలబడి వుండేది మరోమూల.

మా పెద్దమ్మ కూతురు వనజ, చిన్న పెద్దమ్మ కూతురు రేణుక, చిన్న మామయ్య కూతురు మీనా పోటీలు పడి పారిజాతాల్ని ఏరి పూజకు అనువుగా దండకూర్చడం ఒక వింత అనుభూతి.

యాదమ్మ కూతురు మంగ దండకూర్చడంలో అందెవేసిన చెయ్యి. పాపం చిన్నప్పుడే పోలియోతో కాళ్ళు లేకపోయినా, ఎంతో హుషారుగా వుండేది. అమ్మమ్మ అందరిని సమానంగా చూసేది.

ఒకరోజు పార్వతీశం మాస్టారు వచ్చి "మామ్మగారూ! ఈ వైశాఖలో మా అమ్మాయి పెళ్ళి నిశ్చయమైంది. మీరు వచ్చి ఆశీర్వదించాలి" అన్నారు అభ్యర్థనగా అమ్మమ్మతో.

"పెద్దదాన్ని నేనేం వస్తాను లెండి. చిన్నవాళ్ళొస్తారు లెండి" మృదువుగా బదులిచ్చింది అమ్మమ్మ.

"అహహ! అలా అనకండి. ఓపిక చేసుకుని ఎలాగైనా రావాలి మీరు. మీ బోటి పెద్దల ఆశీర్వచనాలు, మంచి మనస్సుతో నిండారా మీరు చేసే దీవెనలే మాకు శ్రీరామరక్ష. జాగ్రత్తగా దగ్గరుండి తీసుకెళ్ళి మళ్ళీ తిరిగి దింపే బాధ్యత నాది. కాదనకండి" మాష్టారి వేడుకోలు.

"మీదంతా చాదస్తం. ఈ పెద్దవాళ్ళ దీవెనలెవరిక్కావాలి ఇప్పుడు. అసలు వాటికి విలువ ఇచ్చేది ఎవ్వరు ఈరోజుల్లో" బోసి నోటితో నిండుగా నవ్వుతూ అన్నది అమ్మమ్మ.

"అమ్మమ్మా! అలా అనకండి. ఇంకా మా తరం మిగిలే వుంది. మీరనేది కరెక్టే. ఇప్పటి వాళ్ళకి నమ

స్కారాలు పెట్టించుకోవడమే గాని, మనఃస్ఫూర్తిగా ఆశీర్వదించటం తెలియదు. అసలు ఎవరినెలా దీవించాలో తెలియదు. నమస్కరించే వారి ఉద్దేశ్యాన్ని గ్రహించి, ఆశీస్సులుండాలి. అటువంటి సంకల్పాన్ని గ్రహించే పరిజ్ఞానం, ఓపిక, సహనం క్షీణిస్తున్నాయి. అది మీలాంటి ఏ కొద్దిమందికే వుంటుంది. అందుకే మీ ఆశీఃఫలితాలు మాకు మంచి చేస్తాయి. కాదనకండి మరి'' అలవాటుగా, క్లాసులో పాఠం చెప్పినంత వివరంగా చెప్పారు మాష్టారు. అటు అమ్మమ్మతో పాటు చెవులప్పగించి వింటున్న పిల్లలం మాక్కూడా కొంత అవగాహన ఏర్పడింది ఆ విషయం మీద.

పెళ్ళిళ్ళు పుట్టిన రోజులు ఉపనయనాలు అంటూ ఎప్పుడూ ఎవరో ఒకరు సాదరంగా తీసుకెళ్ళేవారు. తనవంతు ఆశీస్సులుగా చిన్ని చిన్ని కవితలు రాసి చదివి వినిపించి వాళ్ళకిచ్చివచ్చేది. వాటి విలువ తెలిసినవారు అపురూపంగా దాచుకునేవారు.

''ఏంటీ ఆవిడ పొయిట్రీ కూడా రాసేదా?'' కళ్ళింత చేసుకుని ఆశ్చర్యంగా ప్రశ్నించాడు చందు.

తెల్లవారుఝామున గజేంద్ర మోక్షంతో మొదలుపెట్టి మూడు పూటలా రామాయణ భారత భాగవతాల్లోని శ్లోకాలు రాగయుక్తంగా చదివేది. ఖచ్చితంగా రోజూ ఒకే టైముకి రామకోటి రాసి, పూర్తిచేసి గుళ్ళో యిచ్చింది. చిన్నా చితకా పనులు సరేసరి.

ఇంక చెట్ల విషయానికొస్తే పెరట్లో జామ, దానిమ్మ, సపోటా చెట్లు ప్రతీ రకానికి రెండు చొప్పునుండేవి. మాకొకటి, పిట్టలకు మరొకటి, వేరువేరుగా వుండేవి.

''అదేంటమ్మా! వాటికి వేరే చెట్లేంటి? ఎక్కడా వినలేదే?'' ఆశ్చర్యంగా ప్రశ్నించాడు చందు.

''అవునా! అమ్మమ్మ అలా ఏర్పాటు చేసింది. రామచిలుకలు, గోరొంకలు, పిచ్చుకలు, ఉడతలు ఇంకా రకరకాల పక్షులు వచ్చి చెట్టుమీద వాలి పళ్ళన్నీ కొట్టి తిన్నంతా తిని మిగిలినవి చెల్లాచెదురుగా పడేసి అల్లరి పిల్లల్లాగా నానా ఆగం చేసేవి. అయినా ఎవ్వరం వాటి జోలికి వెళ్ళటానిగ్గాని, పళ్ళు కోయడానికి గాని వీలులేదు. అమ్మమ్మ వూరుకొనేది కాదు. అమ్మమ్మ పడుకొన్నప్పుడు, రామచిలుకలు మధ్యాహ్నం నిద్రపోకుండా చెట్లమీద చేరి అరుస్తూండేవి. 'రామా అల్లరి చెయ్యకండి. నన్ను ఓ కునుకు తియ్యనియ్యండ్రా' అంటూ ఆపేక్షగా విసుక్కొనేది''

''వెరీ ఇంటరస్టింగ్. ఇంకా..'' మురారి గూడా పిల్లలతో సమానంగా శ్రద్ధగా వినడంతో నేను మరింత ఉత్సాహంగా జ్ఞాపకాల పుస్తకాల్లోని పుటలను ఒక్కొక్కటి తిరగేశాను.

అమ్మమ్మ గురించి అన్ని జ్ఞాపకాలు అపురూపమే. ప్రతి వేసవి సెలవుల్లో తప్పకుండా అందరం వెళ్ళేవాళ్ళం. పెరట్లో ఆరు బయట ప్రక్కలేసుకుని, అమ్మమ్మ చెప్పే కథలూ కబుర్లు వింటూ ఆకాశంలో చుక్కలు లెక్కపెట్టే వాళ్ళం. మధ్యలో ఆకతాయితనంగా ఎవరో ఒకరు కావాలని మాట్లాడించటం మళ్ళీ లెక్క మొదట్లోకి రావడం. అవన్నీ ఒక అపురూపమైన అందమైన అనుభూతి. మాటలకందనిది.

**రామచిలుకలు, గోరొంకలు, పిచ్చుకలు, ఉడతలు ఇంకా రకరకాల పక్షులు వచ్చి చెట్టుమీద వాలి పళ్ళన్నీ కొట్టి తిన్నంతా తిని మిగిలినవి చెల్లాచెదురుగా పడేసి అల్లరి పిల్లల్లాగా నానా ఆగం చేసేవి. అయినా ఎవ్వరం వాటి జోలికి వెళ్ళటానిగాని, పళ్ళు కోయడానికి గాని వీలులేదు. అమ్మమ్మ వూరుకొనేది కాదు. అమ్మమ్మ పడుకొన్నప్పుడు, రామచిలుకలు మధ్యాహ్నం నిద్రపోకుండా చెట్ల మీద చేరి అరుస్తూండేవి. 'రామా అల్లరి చెయ్యకండి. నన్ను ఓ కునుకు తియ్యనియ్యండ్రా' అంటూ ఆపేక్షగా విసుక్కొనేది''**

తన్మయత్వంతో నేనిలా చెబుతూండగానే, స్టేషన్ రావటం, ఈలోకంలోకొచ్చి సామాన్లు సర్దుకొని హడావిడిగా రైలుదిగి, టాక్సీ మాట్లాడుకుని అమ్మమ్మ గారింటికి చేరటం చకచకా జరిగిపోయాయి.

మమ్మల్ని చూసిన అమ్మమ్మ చిన్న పిల్లలా సంబరపడింది. బక్కపల్చగా, పచ్చటి పసిమి ఛాయతో, బోసి నోటితో నడుం పూర్తిగా వింటిబద్దలా వంగి, ముడుతలు పడ్డ శరీరంతో వున్న అమ్మమ్మని పిల్లలు వింతగా చూశారు.

''చందూ! తాతమ్మని చూశావా ఎలావుందో. ఆ మధ్యన బాపుగారి బొమ్మల ఎగ్జిబిషన్‌కి వెళ్ళాం గుర్తుందా! అందులో రామాయణంలోని శబరి లాగా వున్నది కదా!'' శ్రావ్య నెమ్మదిగా తమ్ముడితో అంటున్న మాటలు నా చెవిన పడ్డాయి.

''అవున్నిజమే! రామాయణంలో రామునికి ఆప్యాయంగా పళ్ళు తినిపిస్తున్న శబరి జ్ఞాపకం వచ్చింది. అమ్మమ్మలో వయస్సు తెచ్చిన మార్పులు, జీవితానుభవాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. మిగలపండిన తమలపాకులా వుంది. ఇల్లు పరిసరాల్లో పెద్దగా మార్పులేదు. చెట్టు చేమా కూడా అమ్మమ్మతో పాటు పెరిగి పెద్దవయ్యాయి. కానీ యథాప్రకారం ఋతుధర్మాన్ని అనుసరించి ఫలండూ, పూవుకాయ ఇవ్వటంలో తమవంతు కర్తవ్యం ఇంకా పాటిస్తూనే వున్నాయి. పాలేరు వీరయ్య బాగా పెద్దవాడయ్యి పనిలోకి రావటం లేదని, అతని అల్లుడు రాజయ్య బాధ్యత తీసుకున్నాడని, వాళ్ళ అమ్మాయి గంగకు కనుచూపులేదని ఎవరైనా చెప్తే కాని తెలియదని గబగబా చెప్పింది అమ్మమ్మ. కుందనపు బొమ్మలా అలవాటు కొద్దీ అటూ ఇటూ తిరుగుతూంటుంది గంగ ఆ ఇంట్లో. ఆ అమ్మాయి ఆలనా పాలనా అమ్మమ్మే చూసేది.

కాంక్రీట్ జంగిల్‌లో హైటెక్ హంగులతో బందీలైన మా కుటుంబానికి అక్కడ వున్న నాలుగు రోజులు నాలుగు క్షణాల్లా గడిచిపోయినయి. రాచిలుకలు, పావురాలు, పిచ్చుకలతో సమానంగా పిల్లలు కువకువలాడారు. కేరింతలు తుళ్ళింతలు. పిల్లలతో సమానంగా అమ్మమ్మ మమేకమవటం ఎంతో ఆశ్చర్యాన్ని ఆనందాన్ని కలిగించాయి''

మురారి తను తీసుకొచ్చిన డిజిటల్ కెమెరాలో అమ్మమ్మతో సహా అందరిని బంధించాడు. శుచీ, శుభ్రత, ఆచారం, సంప్రదాయం విడువకుండా, ఇంకొకరికి ఇబ్బంది కలిగించకుండా, పాటించే అమ్మమ్మని చూసి ఇప్పటికి ఇంకా ఏమీ మారలేదు అనిపించింది.

''ఆచారం మడి అంటే వేరే ఏమీ కాదు. శుచి శుభ్రతలే ఆరోగ్య చిహ్నాలు కదా. వాటికి మారు పేర్లే ఇవి'' వివరించింది అమ్మమ్మ.

తీపిజ్ఞాపకాల్ని, మధురానుభూతుల్ని, అమ్మమ్మ ఆశీసుల్ని దండిగా తీసుకుని తప్పనిసరిగా వెళ్ళాలి కనుక తిరుగు ప్రయాణమయ్యాము. తన క్లాస్‌మేట్స్ అందరికి ఇక్కడి విశేషాలు ఎలా వివరించాలో ప్లాన్ చేసుకుంటున్నారు పిల్లలు. ఇంటికి చేరి రొటీన్ లైఫ్‌లో మునిగిన మాకు మధురస్మృతులు మరపురాకముందే పిడుగులాంటి వార్త మోసుకొచ్చింది ఫోన్.

''మళ్ళీ నిన్ను చూస్తానో లేదో'' అన్న అమ్మమ్మ మాటలు గుర్తొచ్చాయి హఠాత్తుగా. మనసంతా కకావికలమైంది. నిశ్చేష్టగా కూర్చున్న నాతో ''వేదా ప్రతి మనిషికీ అది తప్పదు. పండుటాకులా రాలిపోయారు ఆవిడ. గుండె దిటవు చేసుకోవాలి ఇలాంటప్పుడే'' ఓదార్చాడు మురారి.

తర్వాత అమ్మమ్మ గురించి తెలిసిన విషయాలు సంభ్రమాశ్చర్యాలకు లోను చేశాయి.

బహుకొద్ది రోజులు మంచం మీద గడిపినప్పుడు, కుటుంబ సభ్యులందరిని ఒప్పించి తీసుకున్న నిర్ణయాలే అబ్బురపరచాయి. అవి తప్పకుండా అమలు చేయాలని హామీ తీసుకుందని తెలిసింది. మమ్మల్ని విచలితుల్ని చేసింది.

ఆచారం, మడి అంటూ చాదస్తంగా వుండే అమ్మమ్మలో ఇంతటి విశాల ఉన్నత భావాలు, ఔన్నత్యం ఆధునికత వున్నాయంటే ఆవిడని మేమెవ్వరం సరిగ్గా అర్థం చేసుకోలేదని, మా ఆలోచనా విధానం ఆవిడ స్థాయికి అందుకోలేక పోయిందని, ఇప్పుడు బాధపడటం మినహా ఏమీ చేయలేకపోయాము.

అమ్మమ్మ తన కళ్ళు వీరయ్య మనుమరాలు గంగకూ, కిడ్నీ రంగి మొగుడు సీతయ్యకూ గుప్తదానం చేసిందని, అయితే ఈ సంగతి ముందరగా ఎవ్వరికీ చెప్పవద్దని ఆంక్ష పెట్టిందని తెలిసి నిశ్చేష్టులైనారు.

నిండైన జీవితాన్ని పరిపూర్ణమైన వార్ధక్యాన్ని అనుభవించిన అమ్మమ్మ ధన్యజీవి. మరణానంతరం, జ్ఞాపకముండే ఏ కొద్దిమందికో దక్కే అవకాశం సద్వినియోగం చేసుకున్న యోగిని. మాధవసేవ, మానవసేవ రెండూ సమానంగా ఆచరించిన పుణ్యచరిత.

రోజూ గజేంద్రమోక్షం చదివే బ్రాహ్మీముహూర్తంలో మోక్షం పొందిందని తెలిసి అచేతనంగా వుండిపోయాము.

★